## సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

**78932 44734**

నంబర్‌ను సంప్రదించండి


## క్లుప్తంగా

### ఫుట్‌పాత్‌పై పలక అమర్చారు



ఫుట్‌పాత్‌పై పలకను సరి చేస్తున్న జీవీఎంసీ సిబ్బంది

**సాక్షి ఎఫెక్ట్..**

**గోపాలపట్నం:** జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజు పాలెం బాజీ జంక్షన్ సమీపంలో ట్రెండ్స్ షోరూం వద్ద ఫుట్‌పాత్‌పై ప్రమాదకరంగా ఉన్న పలకను జీవీఎంసీ అధికారులు సరి చేశారు. డ్రైన్ లోపలకి పలక ఒరిగి ప్రమాదకరంగా ఉండడంతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన ఆదమరిస్తే అంతే అన్న శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వెంటనే మరమ్మతులు చేపట్టారు. దీంతో స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

### ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్న ఆర్‌ఐ కోమలి రెవెన్యూ సిబ్బంది

**గోపాలపట్నం:** జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం దరి భగత్‌సింగ్ నగర్‌లో సర్వే నంబర్ 122/1, 124/3డి2లో భూమిపై ఇటీవల ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు వచ్చాయి. ఈ నేపథ్యంలో గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇందులో 124/3డి2లో 376 చదరపు గజాల విస్తీర్ణం గల స్థలం యూఎల్‌సీ ల్యాండ్‌గా గుర్తించామని, అలాగే సర్వే నంబర్ 122/1లో 394 చదరపు గజాల స్థలం ప్రభుత్వ భూమి(గెడ్డ స్థలం) గుర్తించారు. ఆ స్థలాల్లో సోమవారం ఆర్‌ఐ కోమలి, రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి స్వాధీనం చేసుకున్నారు.

### భారీ అన్నసమారాధన



అన్న ప్రసాదాలను వడ్డిస్తున్న ప్రభుత్వ విప్ గణబాబు

**మల్కాపురం:** జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మార్కెట్ వీధి వద్ద శెట్టిబలిజా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం నిర్వహించిన అన్నసమారాధనను ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. తొలుత దుర్గాదేవి మండపం వద్ద పూజలు చేశారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్, కాకి పోలిరెడ్డి,భోగవల్లి నాగభూషణం, శెట్టిబలిజ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

### జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ

**మల్కాపురం:** జీఎస్టీ తగ్గడం వల్ల చాలా వస్తువుల ధరలు తగ్గాయని ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. జీఎస్టీ తగ్గిన విషయంపై సోమవారం శ్రీహరిపురంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రధాన కూడలిలోని పలు దుకాణాల వద్దకు వెళ్లి అయా షాపుల్లో జీఎస్టీకి తగ్గక ముందు.. ప్రస్తుత ధరలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు తెలిసేలా బోర్డులు పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోరాడ శ్రీనివాసరావు,అంగ దుర్గాప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

**గోపాలపట్నం:** జీఎస్టీ తగ్గడం వల్ల పేద మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరుతుందని 90వ వార్డ కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. గవర వీధి, రెడ్డి వీధి పరిసర ప్రాంతాల్లో సోమవారం జీఎస్టీ తగ్గించిన సరకులు, వస్తువుల కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీవో నాయుడు తదితరులు పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

**భీమునిపట్నం:** భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బోధించడానికి ఇద్దరు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ సోమవారం తెలిపారు. అర్థశాస్త్రం, రసాయన శాస్త్రంలో బోధించడానికి అభ్యర్థుల అవసరముందని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో ఈ సబ్జెక్ట్‌లలో 55శాతం మార్కులు సాధించి ఉండాలని తెలిపారు. అలాగే సెట్, నెట్, పీహెచ్‌డీలో అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గలవారు తమ ధ్రువీకరణ పత్రాలతో వచ్చే 11వ తేదీ ఉదయం పది గంటలకు కళాశాలకు హాజరు కావాలని కోరారు. వివరాలకు 8179780917, 9848632130 నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

# బాబోయ్ దొంగలు!



సెల్‌ఫోన్ చోరీకి పాల్పడుతున్న దొంగ(సీసీ ఫుటేజీ )

- మర్రిపాలెం, గోపాలపట్నం రైతుబజార్లలో ఘటనలు
- నిఘా లోపమే కారణమంటున్న వినియోగదారులు



గోపాలపట్నం రైతు బజారులో వినియోగదారులు

**గోపాలపట్నం:** దొంగతనాలకు చెక్ పెట్టడమే లక్ష్యమని నిత్యం ప్రచారం చేస్తున్న పోలీసులు.. ఆచరణలో మాత్రం శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చోరీలు నియంత్రించాలంటే నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు. పండగల సమయాల్లో పలు కాలనీల్లో మీటింగులు పెట్టి అవగాహన కల్పించడంతో పని అయిపోయిందన్నట్లు పోలీసులు వ్యవహరిస్తున్నారని.. అందుకే చోరీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నా చోరీలు సర్వ సాధారణంగా మారి పోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. నిఘా కొరవడడంతోనే రైతు బజార్లలో దొంగతనాలు ఎక్కువ అవుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. ఇటీవల ఒకే రోజు మూడు సెల్‌ఫోన్లు చోరీ చేశారు. పోలీసులు వచ్చి వివరాలు తీసుకున్నారే తప్పా ఆ తర్వాత ఏం జరిగిందో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆదివారం సమయంలోనైనా రైతుబజార్లలో నిఘా పెట్టడడం లేదని పలువురు వాపోతున్నారు.

**ఇక రద్దీ**

వినాయక చవితో పండగలు ప్రారంభమయ్యాచి. దసరా అయిపోయింది. తర్వాత దీపావళి, కార్తీక మాసం ప్రారంభమవుతుంది. అన్ని రోజులు రైతు బజార్లు వినియోగదారులతో రద్దీగా ఉంటాయి. ఈ సమయంలో చిల్లర దొంగులు చేతివాటం చూపే అవకాశం ఉంటుందని.. పోలీసులు కచ్చితంగా నిఘా పెట్టాలని వినియోగదారులు కోరుతున్నారు.



గోపాలపట్నం రైతు బజారు

### రద్దీ సమయాల్లోనే చోరీలు

ఆదివారాలు, పండగుల సమయాల్లోనే దొంగతనాలకు పాల్పడుతున్నారని పలువురు వినియోగదారులు చెబుతున్నారు. రెండు నెలల కిందట వరుసగా రెండు వారాలు మర్రిపాలెం రైతు బజారుకు వచ్చి సెల్‌ఫోన్లు చోరీకి పాల్పడ్డారు. వచ్చిన ప్రతీ సారి రెండు మూడు సెల్‌ఫోన్లు చోరీ చేసి దర్జాగా వెళ్లి పోతున్నారు.

### నిఘా కరువు

గతంలో నేర విభాగం పోలీసుల నిఘా ఉండేది. ప్రత్యేకంగా రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసుల బీట్ ఉండేది. వీరు అజాగ్రత్తగా ఉండేవారిని అప్రమత్తం చేసేవారు. ఇప్పుడు ఆవిధమైన నిఘా కరువయిందని పలువురు వాపోతున్నారు.మఫ్టీలో నిఘా వేస్తే దొంగలు దొరుకుతారని చెబుతున్నారు. రైతు బజార్లలో రద్దీ సమయాల్లో పోలీసుల నిఘా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### జాగ్రత్తగా ఉండాలి

పండగలు, రద్దీ సమయాల్లో రైతు బజారుకు వచ్చే వినియోగదారులు విలువైన వస్తువులపై అప్రమత్తంగా ఉండాలి. రద్దీగా ఉండే కౌంటర్ల వద్ద దొంగలు ఉంటారని చెబుతున్నాం. దొంగలు కూడా వినియోగదారుల వలే నటించి ఏమరపాటుగా ఉన్న సమయంలో చేతివాటం చూపిస్తున్నారు. సాధ్యమైనంత వరకూ బజారుకు వచ్చిన వినియోగదారులు విలువైన వస్తువులు తేకుండా ఉండడం మంచిది. దొంగతనాలను అరికట్టే విధంగా ఉన్నంతలో చర్యలు తీసుకుంటున్నాం.

– ప్రసాద్, ఈవో, గోపాలపట్నం రైతుబజారు

## అదానీ సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటాం



కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం కార్యకర్తలు

**మల్కాపురం:** పెద్దగంట్యాడ వద్ద అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ సీపీఎం మల్కాపురం జోన్ నాయకులు సోమవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. 59వ వార్డు నెహ్రూనగర్ వద్ద, 61వ వార్డు వెంకన్నపాలెం ప్రాంతాల్లో చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో పైడిరాజు మాట్లాడు తూ సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు వల్ల సుమారు పది లక్షల మంది ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూగర్భ జలాలు కలుషితం అయి అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన కూటమి సర్కార్ ఈ అంశంలో మౌనం వహించడం వెనుక ఆంతర్యమేంటని ప్రశ్నించారు. పరిశ్రమ ఏర్పాటుపై ఈ నెల 8న నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణలో తాము ప్రశ్నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## అదానీ సిమెంట్ కంపెనీ నిర్మాణం ఆపాలి

**డాబాగార్డెన్స్:** గాజువాక పెదగంట్యాడ వద్ద జనావాసాల మధ్య అదానీ సంస్థ అంబుజా సిమెంట్ కంపెనీ నిర్మించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ఈ ప్రతిపాదనను రద్దు చేయాలని జీవీఎంసీ సీపీఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానించేందుకు వెంటనే సమావేశం నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నెల 8న ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకటించిందన్నారు. అదానీ సిమెంట్ కంపెనీ వల్ల గాజువాక, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం ప్రాంతాలు మొత్తం ప్రమాదకరమైన దుమ్ము, ధూళి విషకణాలతో నిండిపోతాయని, తాగునీరు కాలుష్యమవుతుందని, ప్రజలు అనేక ప్రాణాపాయ జబ్బులకు గురవుతారని పేర్కొన్నారు. జీవీఎంసీకి సరఫరా అయ్యే తాగునీరు, ఏలేరు కెనాల్, నీటి రిజర్వాయర్లు విష కాలుష్యమవుతాయన్నారు. ఈ నేపథ్యంలో విశాఖ పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత జీవీఎంసీ ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. తక్షణమే ఎటువంటి జాప్యం లేకుండా జీవీఎంసీ కౌన్సిల్, రాజకీయ పక్షాల ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని గంగారావు విజ్ఞప్తి చేశారు. నగర ప్రథమ పౌరుడిగా ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొని అదానీ అంబుజా సిమెంట్ కంపెనీ ప్రతిపాదనను వ్యతిరేకించాలని కోరారు.

## అర్జీలకు తక్షణ పరిష్కారం



అర్జీదారులతో మాట్లాడుతున్న జెడ్సీ రాము

**కంచరపాలెం:** జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మూడు వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము స్వీకరించి పరిశీలించారు. రెవెన్యూ విభాగానికి 2, టౌన్ ప్లానింగ్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా ఫిర్యాదుల తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఆర్‌ఐ కాకర శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ ఈఈలు తారాప్రసన్నరెడ్డి, పద్మావతి, డీఈ భరణికుమార్, పబ్లిక్ హెల్త్ ఇన్‌చార్జి ఏఎంహెచ్‌వో జనార్దనరావు, సూపరింటెండెట్లు వెంకటరమణ, రాజు, పీఆర్‌వో శేఖర్‌బాబు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'వరల్డ్ స్పేస్ వీక్' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ఆచార్య రాజశేఖర్

**మద్దిలపాలెం:** ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఇంజినీరింగ్ విభాగంలో స్టూడెంట్ సొసైటీ ఉర్వికృతి ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల పోస్టర్‌ను వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ వరల్డ్ స్పేస్ వీక్‌పై విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించే విధంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 10వ తేదీన విభాగ విద్యార్థులకు క్రీడా పోటీలు, 11న మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్), 12న ఐడియాథాన్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 13న పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్, 14 స్పెషియల్ టెక్నాలజీస్–ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై సదస్సు, విశిష్ట ప్రసంగాలు, వివిధ పోటీలలో విజేతలుగా నిలచిన విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య పి.జగదీశ్వరరావు, విద్యార్థులు జి.ఆశిష్, డి.ఎస్.ఎస్ చంద్రవర్ధన్, ఆర్.రిష్, ఎ.సుష్మిత తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**పద్మనాభం:** ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం 18 నుంచి 25 ఏళ్ల లోపు అర్హులైన అభ్యర్థులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కె.రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్‌లో శిక్షణకు అభ్యర్థులు ఇంటర్ ఉత్తీర్ణులు కావాలని పేర్కొన్నారు. బ్రైడల్, ఫ్యాషన్ అండ్ పోర్ట్‌ఫోలియో మేకప్ ఆర్టిస్ట్ శిక్షణకు ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. ప్రొడక్షన్ మెషీన్ ఆపరేటర్‌కు ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, బీఎస్సీ కెమిస్ట్రీ, ఐటీఐలో ఉత్తీర్ణులైన వారు, జనరల్ డ్యూటీ అసిస్టెంట్‌కు పదో తరగతి, ఇంటర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. ఆస్పత్రి బిల్లింగ్ ఎగ్జిక్యూటివ్ శిక్షణ కోసం గ్రాడ్యుయేట్, అండర్ గ్రాడ్యుయేట్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలియజేశారు. మిగతా వివరాలకు 79930 11605 నంబరులో సంప్రదించాలని కోరారు.

## టౌన్‌ప్లానింగ్‌పై ఫిర్యాదుల వెల్లువ



వినతులను పరిశీలిస్తున్న జెడ్సీ శంకర్రావు

**పెందుర్తి:** వేపగుంట జోన్–8 జీవీఎంసీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)లో టౌన్‌ప్లానింగ్ విభాగంపై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. జోనల్ కమిషనర్ శంకర్రావు పాల్గొని వినతులు, ఫిర్యాదుల్ని స్వీకరించి, పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందించారు. అడవివరం ఏరియాలో నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయవద్దని స్థానికులు కోరారు. చినముషిడివాడ ప్రాంతంలో రహదారుల సమస్య పట్టిపీడిస్తోందని, అవసరమైన ప్రదేశాల్లో రోడ్లను నిర్మించాలని ఆ ప్రాంత వాసులు కోరారు. పెందుర్తి దరి కృష్ణానగర్ ఏరియాలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను అరికట్టాలని, చింతల అగ్రహారంలో 80 అడుగుల రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ప్రశాంతి నగర్‌లో రోడ్డు నిర్మించాలని, గోపాలపట్నం దరి శ్రీరాంనగర్‌లో అక్రమ నిర్మాణాలను ఆపాలని అర్జీలు దాఖలు చేశారు. టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు తీసుకోవాలని పలువురు జెడ్సీకి ఫిర్యాదు చేశారు.

## సీజేఐపై దాడి బాధాకరం



సీజేఐ గవాయ్‌పై దాడిని ఖండిస్తున్న భీమ్‌సేన్ వార్ ప్రతినిధులు

**మహారాణిపేట:** సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని భీమ్‌సేన వార్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కంచరపాలెంలోని భీమ్‌సేన వార్ కార్యాలయంలో ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఈ దాడిపై చర్చించారు. కేసు విచారణ జరుగుతుండగా సీజేఐపై ఓ న్యాయవాది దాడికి యత్నించడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు గుడివాడ అప్పారావు, కోశాధికారి బల్లంకి కనకరాజు, కుంచె మధు, ఎద్దు బాలకృష్ణ, జి.రవికుమార్, కృష్ణకుమారి, ఐజాక్, నాంచారయ్య, శంకర్, మహంకాళి తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం:** శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో ఉదయం 9.30 నుంచి ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందించారు. అర్చకులు సాతులూరి నరసింహాచార్యులు, రంగనాథ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

# థర్డ్ డివిజన్‌కు మెజిస్టిక్ సీసీ అర్హత





సీపీ శంఖబ్రత బాగ్చి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న విజేతలు

**విశాఖ స్పోర్ట్స్:** జిల్లా క్రికెట్ సంఘం (వీడీసీఏ) ఆధ్వర్యంలో జరిగిన వార్షిక క్లబ్ క్రికెట్ లీగ్ పోటీల్లో విజేతగా నిలిచిన మెజిస్టిక్ సీసీ జట్టు థర్డ్ డివిజన్‌కు ప్రమోట్ అయింది. 2024–25 సీజన్‌లో ఈ టీమ్ మంచి ప్రతిభ కనబర్చి నాలుగో(ఫోర్త్) డివిజన్ లీగ్ పోటీల ఫైనల్ విజేతగా నిలిచి ఈ అర్హత సాధించింది. వీడీసీఏ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఇన్‌స్టిట్యూషనల్, క్లబ్ స్థాయిలో పోటీలు నిర్వహిస్తుంటారు. డివిజన్ల వారీగా ఒకటి నుంచి ఆరు డివిజన్లకు పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తుంటారు. చివరిదైన ఆరో డివిజన్‌లో జూనియర్ క్రికెటర్లతో కూడిన జట్లు ఉంటాయి. ఆ జట్లు చూపే ప్రతిభ ప్రకారం ఒక్కో డివిజన్‌ను దాటుకుంటూ ముందుకు వెళ్తాయి. అలా ఒకటి, రెండు డివిజన్లలో ఉన్న జట్లలో రంజీ, జాతీయ స్థాయి క్రికెటర్లు సభ్యులుగా ఉంటారు. అదే క్రమంలో ఈసారి పోటీల్లో విజయం సాధించిన మెజిస్టిక్ సీసీ జట్టు నాలుగో డివిజన్ నుంచి మూడో డివిజన్‌కు ఎలివేట్ అయింది. ఇదే డివిజన్‌లో మెజిస్టిక్ జట్టుకు చెందిన కె.వి.కౌల్ ఉత్తమ బ్యాటర్ అవార్డు అందుకున్నాడు. ఈ విజయం స్ఫూర్తితో రెండేళ్లలో ఫస్ట్ డివిజన్ స్థాయికి చేరుకోవడమే లక్ష్యంగా పనిచేస్తామని మెజెస్టిక్ సీసీ డైరెక్టర్ ఎస్.ఎస్.ఆర్.కె.ప్రసాద్, కెప్టెన్ నాగరాజు తెలిపారు.


**ఫస్ట్ డివిజన్ రన్నరప్‌గా మెట్రో సీసీ**

ఈ సీజన్ క్లబ్ క్రికెట్ పోటీల్లో ఒకటో డివిజన్ నుంచి పోటీ పడిన మెట్రో సీసీ జట్టు రెండో స్థానంలో నిలిచింది. రంజీ, జాతీయ జట్టు ఆటగాళ్లకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ జట్టులో వారితో పాటు అండర్–14, 16 ఆటగాళ్లను కూడా చేర్చుకుని అగ్రశ్రేణి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలన్నది తమ లక్ష్యమని మెట్రో సీసీ క్లబ్ డైరెక్టర్ పార్థసారథి, మెంటార్ పి.నాగరాజు తెలిపారు.

### గడువులోగా వినతులు పరిష్కరించాలి

**విశాఖ సిటీ :** వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతులను పరిశీలించి నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి తొమ్మిది వినతులను స్వీకరించారు. ఆయా వినతులను సంబంధిత అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీ కృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్త రోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891 –2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

### ప్రజావసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్

**విశాఖ సిటీ:** ప్రజల అవసరాలకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. మాస్టర్‌ప్లాన్–2041పై సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. మాస్టర్‌ప్లాన్ రూపకల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని చెప్పారు. త్వరలోనే సమగ్రమైన మాస్టర్‌ప్లాన్‌ను తీసుకువస్తామన్నారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ముఖ్య ప్రణాళిక అధికారి శిల్ప, ఇతర విభాగ అధికారులు పాల్గొన్నారు.

### ఎయిడెడ్ టీచర్లకు ఇంకా అందని వేతనాలు

**ఆరిలోవ:** ఉమ్మడి విశాఖ జిల్లాలో ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు నెల వేతనాలు ఇంతవరకు చెల్లించలేదు. జిల్లాలో 17 ఎయిడెడ్ పాఠశాలల్లో సుమారు 65 మంది వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారంతా వేతనాల కోసం ఎదురు చూస్తున్నారని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.ఆర్.అంబేడ్కర్ ఆందోళనన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎయిడెడ్ టీచర్ల వేతనాలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

## మార్మోగిన గోవింద నామస్మరణ

**భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ**



ఉక్కు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

**ఉక్కునగరం:** స్థానిక సెక్టార్–1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఏర్పాటు చేసిన గిరి ప్రదక్షిణ ఆద్యంతం గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ అర్చకులు భావనారాయణ స్వామి, మనోజ్ స్వామి, హరినారాయణ స్వామి నేతృత్వంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వేకువజామున వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. స్వామి పచ్చ కర్పూరంతో ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

**మహారాణిపేట:** వీఎంఆర్‌డీఏ పరిధిలోని వివిధ పార్కుల్లో పనిచేసిన తోటమాలిలను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. వుడా వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో పలువురు కార్మికులు పాల్గొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు, సీఐటీయూ కార్యదర్శి పి.వెంకటరావు మాట్లాడుతూ తోటమాలిలను విధుల నుంచి తొలగించి ఏడాది పూర్తయినా.. నేటికీ తిరిగి పనిలోకి తీసుకోలేదని, నష్టపరిహారం కూడా చెల్లించలేదన్నారు. దీనిపై కార్మిక శాఖ కార్యాలయంలో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ కార్మికులు 30 ఏళ్లుగా వీఎంఆర్‌డీఏ పార్కుల్లో పనిచేస్తున్నారని, వారికి ఎటువంటి పరిహారాలు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని వెంకటరావు ప్రశ్నించారు. తక్షణం కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు, నాయకులు సిహెచ్.రాంబాబు, దేవాడ నరసింగరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com